# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 09-10-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**
2. **ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురంలో ఉప్పాడ మత్స్యకారులతో ఈరోజు సమావేశమయ్యారు.**
3. **రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**
4. **మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా విశాఖపట్నం వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈ మధ్యాహ్నం క్రికెట్ మ్యాచ్ జరగనుంది.**

==========================

రసాయన ఎరువుల వినియోగం తగ్గించేలా రైతులకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయశాఖ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఖరీఫ్ సాగు, రబీ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రకృతి సేద్యం ద్వారా పర్యావరణంతో పాటు ఆర్థికంగా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల సేవలు రైతులకు అందించేలా రైతు సేవా కేంద్రాలను తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

-------------------------

ఉప ముఖ్యమంత్రి కె పవన్ కల్యాణ్ కాకినాడ జిల్లా పిఠాపురంలో ఈరోజు పర్యటిస్తున్నారు.. ఈ సందర్భంగా కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ఉప్పాడ ప్రాంతానికి చెందిన మత్స్యకారులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మత్స్యకారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అనంతరం సముద్ర జలాలు కలుషితమవుతున్నాయని మత్స్యకారులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆ ప్రాంతాన్ని పరిశీలించేందుకు సముద్ర మార్గంలో ప్రయాణించనున్నారు. ఈ మధ్యాహ్నం ఉప్పాడలో నిర్వహించే బహిరంగ సభలో మత్స్యకారులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అలాగే పిఠాపురం నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు.

--------------------------

విజయనగరం శ్రీపైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ఏడాది లోపు పూర్తి చేస్తామని ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు తెలిపారు. కోటి, 80 లక్షల రూపాయలతో చేపట్టనున్న పునర్నిర్మాణ పనులకు ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. అనంతరం అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ, వచ్చే ఏడాది సిరిమానోత్సవం పండుగ నాటికి భక్తులకు ఇబ్బందులు లేకుండా సులభంగా దర్శనం చేసుకునేలా ఆలయాన్ని అభివృద్ధి చేయనున్నామని తెలిపారు.

--------------------------

వస్తు, సేవల పన్ను- జీఎస్టీ ప్రయోజనాలు ప్రతి ఒక్కరికి తెలిసేలా "సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్" కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ ర్యాలీనీ ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు వేర్వేరు ఇతివృత్తాలతో నియోజకవర్గం నుండి గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రతి ఒక్కరికి నగదు ఆదా అవుతుందని కలెక్టర్ తెలియజేస్తూ,

వాయిస్..31 సెకన్లు

--------------------------

బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో జరుగుతున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశాన్ని గణతంత్ర రాజ్యంగా నిలపడంలో భారత పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

--------------------------

కాలానుగుణ వ్యాధులు, ఆసుపత్రుల్లో పారిశుద్ధ్యం, ఔషధాల పంపిణీ సహా పలు అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఈ రోజు సమీక్ష నిర్వహిస్తారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుండి దృశ్యమాధ్యమం విధానంలో ఈ మధ్యాహ్నం జరిగే ఈ సమావేశంలో జిల్లాల కలెక్టర్లు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ్ యోజన పురోగతి, ప్రజా అవగాహన, ఎస్సీ, ఎస్టీ అత్యాచార చట్టం కింద తీసుకుంటున్న చర్యలతో పాటు పింఛన్లు తదితర అంశాలపై చర్చించనున్నారు.

--------------------------

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విజయవాడలో రహదారులు, భవనాల శాఖ ఉన్నతాధికారులతో ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల భారీ వర్షాలు, తుఫానులతో రాష్ట్రంలో మరమ్మతులకు గురైన రోడ్లకు మరమ్మతులు, కొత్తగా చేపట్టబోయే అభివృద్ధి పనులు వంటి పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే రహదారుల అభివృద్ధికి ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన పలు ప్రతిపాదనలు, ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం – పీపీపీ విధానంలో చేపడుతున్న రహదారుల నిర్మాణంపై చర్చించారు.

--------------------------

విజయవాడను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని విజయవాడ తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ తెలిపారు. విజయవాడ ఎల్ఐసీ కాలనీలో 24 లక్షల రూపాయలతో

చేపట్టిన తాగునీటి సరఫరా పనులకు ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ, నగరంలో పర్యాటకాభివృద్ధికి 'విజయవాడ ఉత్సవ్'ను నిర్వహించామన్నారు. పర్యాటక అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల భాగస్వామ్యంతో పోషణ అభియాన్ అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని శ్రీకాకుళం జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు ఇ.విమల తెలిపారు. శ్రీకాకుళంలో ఆమె నిన్న మాట్లాడుతూ, శ్రీకాకుళం జిల్లాలోని 3 వేల 385 అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని 30 మండలాల్లో పోషణ అభియాన్ మాసోత్సవాలు నిర్వహిస్తూ, పోషకాహార ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

వాయిస్ ...33 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రేపు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలలో ఏర్పాట్లను కలెక్టర్ ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని వెంకటాచలం మండలం సర్వేపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఇథనాల్ ప్లాంట్, గోశాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ – మెప్మా ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలో ఏర్పాటుచేసిన స్మార్ట్ స్ట్రీట్‌ను ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు.

---------------------------

మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య ఈరోజు విశాఖపట్నం వేదికగా క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ మధ్యాహ్నం 3 గంటలకు మ్యాచ్ ప్రారంభంకానుంది. ఇప్పటికే జరిగిన తొలి రెండు మ్యాచులలో విజయం సాధించి, భారత్ పాయింట్ల పట్టికలో రెండవ స్థానంలో కొనసాగుతోంది.

---------------------------

తెలంగాణ, రాయలసీమ, తమిళనాడు ప్రాంతాల మీదుగా ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో... రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్.వెంకట్రావు పేర్కొంటూ..

..వాయిస్.. 30 సెకన్లు

---------------------------

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలో బాణాసంచా తయారీ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతులకు సంబంధించిన కుటుంబ సభ్యులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిన్న పరామర్శించారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, బాణాసంచా తయారీ కర్మాగారాలు కనీస భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సంఘటనపై విచారణ జరుగుతోందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

======================